క్లుప్తంగా

రైతులను ఇబ్బంది పెడితే సహించం

తిరువూరు ఆర్డీఓ మాధురి హెచ్చరిక



తిరువూరు: రబీ ధాన్యం అమ్మకానికి వచ్చే రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి రైతు సేవా కేంద్ర సిబ్బందిని హెచ్చరించారు. ఎ.కొండూరు మండలం కోడూరు, పోలిశెట్టిపాడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్షేత్ర స్థాయిలో నెలకొన్న ఇబ్బందులను ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. కోడూరు పీఏసీఎస్ సిబ్బంది ధాన్యం కొనుగోలులో ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని తరలించకముందే వారికి నిబంధనలు తెలియజేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎ.కొండూరులో రైతుల నుంచి సేకరించిన ధాన్యం నిల్వ చేసిన రైస్ మిల్లును ఆర్డీఓ తనిఖీ చేశారు. ఇటీవల భారీ వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ఆమెను కోరారు.

నగర పంచాయతీ కార్మికుల ధర్నా



తిరువూరు: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ తిరువూరు నగర పంచాయతీ కార్మికులు బుధవారం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి అవుట్ సోర్సింగ్ కార్మికులుగా పని చేసి మరణించిన, పదవీ విరమణ చేసిన, అనారోగ్యం పాలైన వారి కుటుంబాలకు వెంటనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, గ్రాట్యూటీ చెల్లించాలని కోరారు. కార్మికుల ఉద్యోగ విరమణ వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన ధర్నాలో కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు నాటక రంగ దినోత్సవం

తిరువూరు: తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని బుధవారం గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రచయిత కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన నాటకరంగానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కళాకారుడు తల్లపురెడ్డి కిశోర్‌రెడ్డిని కమిటీ సభ్యులు సత్కరించారు.

నవ ధాన్యాల సాగుపై అవగాహన

తిరువూరు: రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు ముందే నవ ధాన్యాలతో చేసిన కిట్లను పొలంలో వేయడం వలన భూమికి కావలసిన పోషకాలు విస్తృతంగా అందుతాయని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో రైతులకు నవ ధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని సీజన్లలో పంటల సాగుతో భూతాపం తగ్గుతుందన్నారు. నవ ధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. తిరువూరు మండల వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి యాత్ర



మైలవరం: హింస, చెడు మార్గాన్ని విడిచి ప్రజలందరూ ఐకమత్యంతో జీవించాలని విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ అన్నారు. మైలవరం శాంతినగర్‌లోని ఆర్‌సీఎం విచారణ దేవాలయం నుంచి క్రైస్తవులు ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ నిర్వహించారు. చెవుటూరు కలువగిరి కొండ సిలువ వద్దకు పాదయాత్ర నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ జయరాజు దివ్య బలిపూజ జరిపించారు. భక్తులకు చెవుటూరు యూత్ సంఘస్తులు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. 16 సంఘాల విశ్వాసులు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత

ఆగిరిపల్లి: కౌమార దశలో ఉన్న విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవన శైలిపై అవగాహన కల్పించేందుకు పీర్ ఎడ్యుకేటర్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో బుధవారం 10 మంది పీర్ ఎడ్యుకేటర్స్ విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. వీరు తమ సహచర విద్యార్థులకు మానసిక ఒత్తిడి నుంచి బయటపడేందుకు అవగాహన కల్పిస్తారని వైద్యులు తెలిపారు. ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఎంపీహెచ్ఈఓ రత్నబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- మూడు నెలలుగా అందని వేతనాలు
- నియోజకవర్గంలో బకాయిల మొత్తం రూ.5.13 కోట్లు
- మండుటెండలో కష్టపడినా కడుపు నిండని వైనం
- పూట గడవక ఇబ్బందులు



నూజివీడు మండలం కొత్తూరు తండాలో ఉపాధి హామీ పథకంలో మల్లయ్యకుంట ఫీడర్ ఛానల్ పనులు చేస్తున్న కూలీలు

నూజివీడు: మూడు నెలలుగా వేతనాలు అందక ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదిలో ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించి ప్రతి పదిహేను రోజులకు ఒకసారి కూలి డబ్బులు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మండుటెండలో శ్రమించిన కూలీలకు నెలల తరబడి వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో రెక్కాడితేనేగాని డొక్కాడని ఉపాధి కూలీలకు పూట గడవడం కష్టంగా మారింది.

నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు పూర్తిగా వ్యవసాయాధారిత మండలాలు కావడంతో ఇక్కడి కూలీలకు వ్యవసాయ పనులు సాగితేనే పనులు ఉంటాయి. జనవరి నుంచి జూన్ వరకు పెద్దగా పనులేమీ ఉండవు. ఈ సమయంలో కూలీలకు ఉపాధి పనులే దిక్కుగా మారాయి. ఉపాధి పనులకు వెళ్లి వచ్చే కూలి డబ్బులతో కాలాన్ని వెళ్లబుచ్చుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో చేసిన పనికి నెలల తరబడి కూలి డబ్బులు చెల్లించకపోవడంపై కూలీలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇటీవలి వరకు రూ.300 ఉన్న రోజువారీ కూలి, ఏప్రిల్ ఒకటి నుంచి కేంద్ర ప్రభుత్వం రూ.307కు పెంచింది. ప్రతి మండలంలో రోజుకు 2 వేల నుంచి 2,500 మంది కూలీల వరకు ఉపాధి పనులకు వెళ్తున్నారు.

వీరు ఉదయం 6 గంటలకు వెళ్లి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేసి ఇళ్లకు చేరుతున్నారు. జనవరి నుంచి కోట్లాది రూపాయల సొమ్ములు చెల్లించకపోవడంతో వాటి కోసం పేదలు ఎదురు చూస్తున్నారు.

రూ. 5.13 కోట్ల బకాయిలు..

సప్లయి చానల్స్‌లోని పూడికతీత పనులు, ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు, నీటి కుంటల తవ్వకాలు, ట్రెంచి కటింగ్ వంటి పనులకు కూలీలు వెళ్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి ఇప్పటి వరకు రూ.5.13 కోట్లు కూలి డబ్బులు కూలీలకు చెల్లించాల్సి ఉంది. ఇవి ఎప్పుడు చెల్లిస్తారనేది అధికారులు కూడా సరిగా చెప్పడం లేదని, ఎప్పుడడిగినా రేపు,మాపు అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ కూలి డబ్బులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మండలం	కూలీలకు రావాల్సిన బకాయిలు
నూజివీడు	రూ.1.20 కోట్లు
ఆగిరిపల్లి	రూ.1.50 కోట్లు
ముసునూరు	రూ.1.03 కోట్లు
చాట్రాయి	రూ.1.40 కోట్లు
మొత్తం	రూ.5.13 కోట్లు

మూడు నెలల కూలి రావాలి



ఉపాధి హామీ పథకం కూలి పనులకు వెళ్తున్నా. గతంలో పది రోజులకు, పదిహేను రోజులకు ఒకసారి డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు మూడు నెలలుగా కూలి డబ్బులు రాలేదు. డబ్బులు రాకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది. వెంటనే కూలి డబ్బులు ఇవ్వాలి.

– నక్కనబోయిన పంగిడమ్మ, ఆగిరిపల్లి

చెల్లింపుల్లో కొంత ఆలస్యం



ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లింపులో కొంత ఆలస్యం జరిగింది. దీంతో కూలీల నుంచి కూడా ఒత్తిడి వస్తోంది. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే నేరుగా కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి.

– శ్యామ్, ఏపీఓ, నూజివీడు

సమర్థంగా ధాన్యం కొనుగోళ్లు

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్



చింతలవల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ముసునూరు: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఆదేశించారు. బుధవారం చింతలవల్లిలోని మారుతి ట్రేడర్స్ రైస్ మిల్లు, ముసునూరు, చింతలవల్లి రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచుల నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలుకు అవసరమైన తక్షణ చర్యలను చేపట్టాలన్నారు. తేమ శాతం, కొలత, సాంకేతిక అంశాలు, ఆన్‌లైన్ తదితర విషయాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం చిల్లబోయినపల్లి గ్రామానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుపై వివాదాస్పద భూమిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కె. రాజ్‌కుమార్, సివిల్ సప్లయిస్ డీటీ జి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ దీపిక, వీఆర్‌ఓలు నవీన్, యశోద, వ్యవసాయ సొసైటీల, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుపై టీడీపీ ఎమ్మెల్యే దౌర్జన్యం

భూమిని లాక్కునేందుకు యత్నిస్తున్నారని రైతు ఆవేదన



టీడీపీ నాయకులు నరికించిన మామిడి చెట్లను చూపుతున్న బాధిత రైతులు

సాక్షి నెట్‌వర్క్ : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారాన్ని అడ్డు పెట్టుకొని తాము కొనుక్కున్న ఎకరం భూమిని లాక్కునేందుకు స్థానిక టీడీపీ నాయకులతో దౌర్జన్యం చేయిస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండల పరిధి రంగాపురం గ్రామానికి చెందిన మద్దిరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఆయన కుమారులు అంజిరెడ్డి, నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రంగాపురం గ్రామ పరిధిలో 368/1లో గల ఎకరం మామిడితోటలో కొందరు వ్యక్తులు బుధవారం మామిడి చెట్లను నరుకుతున్న క్రమంలో మద్దిరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఆయన కుమారులు అడ్డుకున్నారు.

1972లో కొనుగోలు..

బాధిత రైతులు మాట్లాడుతూ తాము 1972లో పడమటి కోటేశ్వరరావు అనే వ్యక్తి నుంచి ఎకరం భూమిని కొనుగోలు చేశామని చెప్పారు. దీనికి ముందు 1963లో గౌతు యశోదరాదేవి నుంచి పడమటి కోటేశ్వరరావు ఈ భూమిని కొనుగోలు చేశారన్నారు. అయితే ఇప్పుడు మా ఎకరం భూమి తమదేనంటూ యశోదరాదేవి మనుమరాలు, ప్రస్తుత పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆమె భర్త వెంకన్న చౌదరి తమపై దౌర్జన్యం చేయిస్తున్నారన్నారు. తాము ఎకరం భూమి కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు ఉన్నందున తాము ఇప్పటికే కోర్టును కూడా ఆశ్రయించామని బాధితులు తెలిపారు. వివాదం కోర్టులో ఉండగానే ఎమ్మెల్యే శిరీష, ఆమె భర్త కలిసి తమను బెదిరించి భూమిని లాక్కునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే శిరీష ప్రోద్బలంతో పోలీసులపై ఒత్తిడి

ఎమ్మెల్యే శిరీష ప్రోద్బలంతో స్థానిక టీడీపీ నాయకుడు విజయ్‌బాబు స్థానిక పోలీసులపై ఒత్తిడి తెచ్చి తమను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు సైతం తమకు సహకరించడంలేదని వాపోయారు. 30 ఏళ్లుగా పెంచుకున్న మామిడి చెట్లను నరికేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఎమ్మెల్యే శిరీష, ఆమె భర్తతో పాటు స్థానిక టీడీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను అరికట్టాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఆకుకూరలతో రక్తహీనత దూరం

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రసింగ్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ నరేంద్రసింగ్

నూజివీడు: గర్భిణులు ప్రతి రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిస్తారని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి నరేంద్రసింగ్ మాట్లాడుతూ ఆహారంలో ప్రతి రోజూ ఆకుకూరలు, పండ్లు, కోడి గుడ్డు, పాలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మునగాకు వంటి ఆకుకూరలు తీసుకోవడం ద్వారా తల్లీ, బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారని చెప్పారు. ఆకుకూరలు తీసుకోవడం ద్వారా గర్భిణులు రక్తహీనత దరిచేరకుండా సురక్షితంగా ఉంటారన్నారు. పండంటి బిడ్డకు జన్మనిస్తేనే ఆరోగ్యకరమైన సమాజం నెలకొంటుందని చెప్పారు. హోమియో వైద్యులు వై. మాధవి మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడం ద్వారా ఆరోగ్యవంతమైన పెరుగుదల ఉంటుందన్నారు. పోషకాల లోపానికి గురికాకుండా ఉంటారన్నారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఫైర్ ఆఫీసర్ గౌతమ్



రాజ్యలక్ష్మి టవర్స్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మైలవరం: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ ఎం. గౌతమ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం మైలవరం నూజివీడు రోడ్డులోని గూడవల్లి రాజ్యలక్ష్మి టవర్స్‌లో సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిన్న పిల్లల చేతికి అగ్గిపెట్టెలు ఇవ్వడం, వంట పూర్తయిన తరువాత గ్యాస్‌ను పూర్తిగా కట్టేయకపోవడం వంటి కారణాల వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సిగరెట్లు కాల్చి పూర్తిగా ఆర్పివేయకుండా పారేయడం వలన కూడా ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మాన్‌లు పి.రాజా రత్నబాబు, ఐ. బాలాజీ, డ్రైవర్, ఆపరేటర్లు పాల్గొన్నారు.

- **నూజివీడు:** చిన్నచిన్న జాగ్రత్తలను పాటించడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని నూజివీడు ఇన్‌చార్జి ఫైర్ అధికారి డి. మత్తయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్ల వాసులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అవసరమైన ప్రదేశాల్లో ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ల వద్ద అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు సరిపడా నీటిని, ఫిక్స్‌డ్ ఫైర్‌ఫైటింగ్ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. ఐఎస్ఐ మార్కు కలిగిన ఎలక్ట్రిక్ సామగ్రిని మాత్రమే వాడాలని, వంట గ్యాస్ సిలిండర్‌ల వద్ద గ్యాస్ లీకై మంటలు వస్తుంటే రెగ్యులేటర్ కట్టేయాలని చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ర్యాంకర్లకు అభినందన



తిరువూరులో రాష్ట్ర స్థాయి ర్యాంకర్ ప్రత్యూషను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తున్న నాయకులు

తిరువూరు: ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పింగళి ప్రత్యూషను కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, అధ్యాపకులు బుధవారం అభినందించారు. ఒకేషనల్ ఫిషరీస్ విభాగంలో 1000 మార్కులకు 964 మార్కులు సాధించినందుకు ప్రత్యూషను సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. కళాశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో బైపీసీ గ్రూపులో వి. వరుణ్ తేజ్ 944 మార్కులు, ఒకేషనల్ ఈఈటీలో వి. గిరిశంకర్ 896, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్‌లో ఎస్ ఎల్ మణికంఠ 865, హెచ్ఈసీలో ఎం. శ్రీలత 859, సీఈసీలో జి. సిద్ధార్థ 826 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వివరించారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులకు సన్మానం

మైలవరం: ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు అభినందనీయులని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను అన్నారు. ఇటీవల విడుదలైన ప్లస్ టులో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంబీఎం జిల్లా పరిషత్ విద్యార్థులు, ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం మైలవరం ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్లస్ టూలో బుధవారం జరిగింది. శ్రీను మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో కూడా మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి. నాగరాజు, సేవాదళ్ జిల్లా కన్వీనర్ ఎ. శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కేవీఎల్ నాంచారమ్మ, మండల అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ రామకృష్ణారావు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

నూజివీడు: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో బైపీసీ గ్రూపులో వెయ్యి మార్కులకు 991 మార్కులు సాధించిన పట్టణానికి చెందిన కుప్పాల దేదీప్యసాయిని బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో విద్యార్థినిని సత్కరించి అభినందించారు. అలాగే పట్టణంలోని స్నేహ రైడ్స్ అనాథ పిల్లల వసతిగృహంలో ఉండి చదువుకుంటూ బైపీసీలో 772 మార్కులు సాధించిన బి. శైలును ఘనంగా సత్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నూజివీడు: ఎంతో విలువైన నీటిని వృథా చేయకూడదని, విద్యార్థి దశ నుంచే జలం ప్రాముఖ్యత తెలుసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని గొల్లపల్లి హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. స్థానిక హైస్కూల్‌లో బుధవారం జల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడాలని, ఎక్కడైనా ట్యాప్‌లలో నీరు వృథాగా పోతుంటే వెంటనే ఆపాలని చెప్పారు. చెరువులు, నదులు, సరస్సుల్లోని నీటిని కలుషితం చేయకూడదన్నారు. నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చెప్పారు. నీటిని సంరక్షిస్తేనే భవిష్యత్ అని, జలమే ప్రగతికి ప్రాణాధారమన్నారు. పెద్ద నగరాలన్నీ సముద్రాల ఒడ్డున, నదుల ఒడ్డునే ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులతో జల ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యధిక వర్షపాతం నమోదు

తిరువూరు: తిరువూరు డివిజన్‌లో మంగళవారం అర్ధ రాత్రి భారీ వర్షం కురిసింది. తిరువూరులో 37.6 మిల్లీ మీటర్లు, గంపలగూడెంలో 19.2, ఎ.కొండూరులో 17 మిల్లీ మీటర్లు, రెడ్డిగూడెంలో 7.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గంపలగూడెం మండలం గుళ్లపూడిలో భారీ వర్షం కారణంగా అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. గత మూడు రోజుల్లో రెండుసార్లు కురిసిన వర్షాలకు వరిపంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సీసీ రోడ్లు ప్రారంభం

జి.కొండూరు: మండల పరిధి కట్టుబడిపాలెం, జి.కొండూరు, గడ్డమణుగు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ. ఒక కోటితో నూతనంగా నిర్మించి సీసీ రోడ్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. అనంతరం జి.కొండూరు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 89 మంది నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. మండల పరిధిలోని ఏడుగురు లబ్ధిదారులకు రూ.3.28 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం ఉదయం నిర్వహిస్తామని కమిషనర్ లోవరాజు తెలిపారు. చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అంశాలపై కౌన్సిలర్లు చర్చించి తీర్మానిస్తారన్నారు. గత సమావేశంలో చైర్‌పర్సన్ కస్తూరిబాయి తన పదవికి సమర్పించిన రాజీనామాను ఈ సమావేశంలో కౌన్సిల్ ఆమోదించేందుకు అవకాశం ఉంది.

మైలవరం ఏఎంసీ చైర్మన్‌గా నవ్యశ్రీ



జి.కొండూరు: మైలవరం మార్కెట్ యార్డు చైర్మన్‌గా మైలవరం మండల పరిధి చంద్రగూడెంకు చెందిన పొనకల్ల నవ్యశ్రీ నియమితులయ్యారు. టీడీపీ అధిష్టానం బుధవారం విడుదల చేసిన ఏఎంసీ చైర్మన్‌ల జాబితాలో నవ్యశ్రీ పేరు ఖరారైంది. నవ్యశ్రీకి పలువురు అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మైలవరం: రెడ్డిగూడెం మండలంలోని ఓబులాపురం, రంగాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెడ్డిగూడెం తహసీల్దార్ జె. సుశీలాదేవి బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్‌ఓలు ఇమ్మానియేలు, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఫణికుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. నిందితుడు పరసా నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు. పోతనపల్లి తండాలో 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఘటనా స్థలం నుంచి పారిపోయిన వడిత్యా భిక్షాలుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

సమస్యలపై అభిప్రాయాల సేకరణ

ఇబ్రహీంపట్నం: మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పనపై ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీల అభిప్రాయాలను ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న సేకరించారు. ఎంపీపీ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో తాగునీరు, రోడ్లు, పర్యావరణం, కాలుష్యం వంటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సేకరించిన సమస్యలు, అభిప్రాయాలను తిరుపతిలో శుక్రవారం జరుగనున్న 16వ ఆర్థిక సంఘం ప్రతినిధుల సమావేశంలో ఆమె వివరిస్తారు. ఎంపీడీఓ సునీతశర్మ, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

ముసునూరు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు వచ్చిన చిన్నారులను చేర్పడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచాలని ఎంఈఓ బీవీ సుబ్బారావు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, రాగి పిండి, బెల్లం తదితర పోషక పదార్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

రూ.8.92 లక్షల అపరాధ రుసుం విధింపు

నూజివీడు: విద్యుత్ విజిలెన్స్ అధికారులు పట్టణంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం విజయవాడ సర్కిల్ ఎస్ఈ ఎం. సాంబశివరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎస్ఈ బి. విజయకృష్ణ, ఆపరేషన్ ఈఈలు ఎ. సత్యనారాయణ, పి. విజయకుమారి (విజిలెన్స్), ఏపీటీఎస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ డి. గంగాభవానీల పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరిగాయి. 50 మంది అధికారులు, 188 మంది సిబ్బంది కలిసి 47 బృందాలుగా ఏర్పడి 3,471 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న వారికి మొత్తం రూ.8.42 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 12 మందికి రూ.2.20 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనపు గృహ విద్యుత్ లోడును వాడుతున్న 162 మందికి రూ.4.94 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వాణిజ్యానికి విద్యుత్ వాడుతున్న 45 మందికి రూ.1.28 లక్షల చొప్పున అపరాధ రుసుం విధించారు.

ప్రతి మీటరుకు సీలు ఉండాలి

ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి మీటర్‌కు తప్పనిసరిగా సీలు ఉండాలని, ఏదైనా కారణం వల్ల సీలు ఊడిపోతే వెంటనే తమ సిబ్బందికి తెలపాలన్నారు. అలా చేయకపోతే తనిఖీల్లో వెలుగు చూస్తే ఉద్దేశపూర్వకంగా విద్యుత్ చోరీకి పాల్పడుతున్నట్లుగా భావించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో డీఈలు ఓలేటి దుర్గారావు, ఎం. పోతురాజు, పి. రామకృష్ణ, సోమేశ్వరరావు, వి. హరికిరణ్, పి. నాగేశ్వరరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.